టీచర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

చిత్తూరు అర్బన్: మహిళా ఉపాధ్యాయురాలిని కులం పేరుతో దూషించిన టీచర్‌పై అట్రాసిటీ కేసు నమోదయ్యింది. చిత్తూరు నగరంలోని సంతపేట పిఎన్‌సి నగరపాలకోన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు ఈనెల 6వ తేదీన సర్వీసు రిజిస్టర్ తీసుకొని గిరింపేట నగర బాలికోన్నత పాఠశాలకు వెళ్లి జీతాల బిల్లు పెట్టేందుకు మరో తోటి ఉపాధ్యాయుడు ఏకాంబరం రెడ్డిని కలిసారు. అందరూ ముందుగా తెచ్చి ఇచ్చారు . మీరు ఎందుకు ఆలస్యంగా వచ్చారని ఆగ్రహంతో ఆమెపై ఊగిపోతూ ఉండగా, గిరింపేట పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఆమెను కుర్చీలో కూర్చొమని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏకాంబరం రెడ్డి ఆమె దళిత కులానికి చెందిన మహిళను ఎందుకు కుర్చీలో కూర్చోబెట్టి గౌరవిస్తారు అని కులం పేరుతో దూషించాడని మహిళా ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి ఏకాంబరం రెడ్డి పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సిఐ నరసింహారాజు తెలిపారు .

ఇదే ఫైనల్...!

ఎంఎల్‌సి ఓటర్ల తుది జాబితా విడుదల / పట్టభద్రుల మొత్తం ఓటర్లు 3,81,181 / ఉపాధ్యాయులు మొత్తం 27,694

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎం.ఎల్.సి ఎన్నికల ఓటర్లతుది జాబితాను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ హరినారాయణన్ శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. పట్టభద్రుల నియోజకవర్గానికి ఆరు జిల్లాల పరిధిలో 320 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఓటర్లు 3,81,181 ఇందులో పురుషులు- 2,45,866 మహిళలు- 1,35,284, ఇతరులు-31 ఉన్నారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 6 జిల్లాల పరిధిలో 175 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఓటర్లు 27,694 ఇందులో పురుషులు- 16,825, మహిళలు-10,869

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎం.ఎల్.సి ఓటర్లకు సంబంధించి 6 జిల్లాల పరిధిలో అన్నమయ్య, బాపట్ల, చిత్తూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు (నెల్లూరు), తిరుపతి జిల్లాల లో మొత్తం 320 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా మొత్తం 3,81,181 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎం.ఎల్.సి ఓటర్లకు సంబంధించి అన్నమయ్య,బాపట్ల,చిత్తూరు,ప్రకాశం,శ్రీ పొట్టి శ్రీరాములు (నెల్లూరు), తిరుపతి జిల్లాల లో మొత్తం 175 పోలింగ్ స్టేషన్ల పరిధి లో 27,694 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

ఎంఎల్‌సి ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న జిల్లా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	48	31
మొత్తం ఓటర్లు	54,152	3,887
పురుషులు	35,189	2,341
స్త్రీలు	18,960	1,546
ఇతరులు	3	-

తిరుపతి జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	62	37
మొత్తం ఓటర్లు	86,941	6,132
పురుషులు	53,435	3,604
స్త్రీలు	33,494	2,528
ఇతరులు	12	-

అన్నమయ్య జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	21	15
మొత్తం ఓటర్లు	23,838	1,932
పురుషులు	15,490	1,180
స్త్రీలు	8,345	752
ఇతరులు	3	-

బాపట్ల జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	24	13
మొత్తం ఓటర్లు	26,390	1789
పురుషులు	17,626	1094
స్త్రీలు	8,763	695
ఇతరులు	1	-

ప్రకాశం జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	86	40
మొత్తం ఓటర్లు	82,225	5,789
పురుషులు	55703	3,691
స్త్రీలు	26,517	2,0898
ఇతరులు	5	-

నెల్లూరు జిల్లా

	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
పోలింగ్ స్టేషన్లు	79	39
మొత్తం ఓటర్లు	1,07,635	8,165
పురుషులు	68,423	4,915
స్త్రీలు	39,205	3,250
ఇతరులు	7	-

'మండలి' పోలింగ్‌స్టేషన్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, గూడూరు

మార్చి 14న మండలి పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉండాలని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, చెక్‌లిస్టు మేరకు వసతులు ఉండాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. గూడూరు డివిజన్‌లో ఆర్డీవో కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రకాశం - నెల్లూరు - చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వెంకటగిరి జడ్‌పి హైస్కూల్లో కనీస సౌకర్యాలు ఉన్నాయా? లేవా? అని చూశారు. ఆరో తరగతి విద్యార్థి పుట్టినరోజు అని తెలుసుకుని ఆశీర్వదించారు. కోట ఎవికెఆర్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి 'గోరుముద్ద' రుచి చూసి పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం లోపం గల పిల్లలకు సప్లిమెంట్ అదనంగా చిక్కీలు, గుడ్డు వంటివి ఇవ్వాలని సూచించారు. గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్, బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. వాకాడు తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంపిడిఒ తోట గోపీనాథ్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సారంగపాణి ఏర్పాట్లను వివరించారు.

సింఘానియా ఎడ్యుకేషన్ ట్రస్ట్‌తో టిటిడి పాఠశాల ఎంఓయు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో టిటిడి ఆధ్వర్యంలో నడిచే శ్రీ వేంకటేశ్వర ప్రాథమిక, ఉన్నత పాఠశాల శనివారం సాయంత్రం దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన సులోచనా దేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయు) కుదుర్చుకుంది. తిరుమలలోని బంగ్లాలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి సమక్షంలో దేవస్థానం విద్యాసంస్థల తరపున డిఇవో డా. భాస్కర్ రెడ్డి, సింఘానియా ఎడ్యుకేషన్ ట్రస్ట్ గౌరవ కార్యదర్శి అరుణ్ మహేష్ అగర్వాల్‌తో పాటు సింఘానియా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్ మధ్య ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యా ప్రమాణాలు పెరిగి భారతదేశంలోని ఉన్నతమైన పాఠశాలగా అభివద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. డిజిటల్ లెర్నింగ్, బోధనా పద్ధతులు, విశ్లేషణా సామర్థ్యం తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వడం ద్వారా విద్య నాణ్యతను మెరుగుపరచాలని సింఘానియా ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రతినిధులను ఆయన కోరారు. అవసరమైన పూర్తి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, విద్యా బోధనాంశాలపై దష్టి పెట్టాలని, తద్వారా దేశంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులతో గుణాత్మక విద్యను అందించేందుకు తమవంతు కషి చేస్తామని సింఘానియా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. లక్ష మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే రేమాండ్ గ్రూప్ సిఎండి గౌతమ్ సింఘానియా జీవిత ఆశయమని, ఇందులో భాగంగా టిటిడితో ఒప్పందం కుదుర్చుకోవడాన్ని గొప్ప అవకాశంగా భావిస్తున్నామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కష్ణమూర్తి, విద్యా విభాగం ఏఈవో ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ మమత పాల్గొన్నారు.

శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సత్యవేడు రూరల్

శ్రీసిటీలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. సిబ్బంది, స్థానికులతో కార్యక్రమం ప్రాధాన్యత వివరించి ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాలు నివారించడానికి భద్రత అంశాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈభద్రతా వారోత్సవాల లక్ష్యమన్నారు. పని ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయన్నారు. దీనిని నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమలు కలసి తరచూ తమ ఉద్యోగులు, కార్మికులకు భద్రత పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రతా వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలతో పాటు శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4 న ముగింపు ఉత్సవం జరుగుతుందన్నారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనులు ఆలస్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

తిరుపతి తుడా మైదానం పక్కన జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులు ఆలస్యం అవుతున్నాయని సంబంధిత కాంట్రాక్టర్ పై తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎమ్‌డి అనుపమ అంజలి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇండోర్ స్టేడియం పనులను శనివారం ఆమె పరిశీలించారు. పనులు చాలా ఆలస్యం అవుతున్నాయని, ఇంత ఆలస్యంగా పనులను చేపట్టడం వలన ఎప్పటికి భవనం అందుబాటులోకి వస్తుందని కాంట్రాక్టర్ ను నిలదీశారు. ఇలానే పనులు ఆలస్యం చేస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ సుమారు ఏడు కోట్లతో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, కబాడి, బాస్కెట్ బాల్, జిమ్నాయిజం కోర్టులు ఆటలు ఆడేందుకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం పూర్తి అయితే క్రీడాకారులకు మంచి ఇండోర్ క్రీడా సముదాయం అందుబాటులోకి వస్తుందని కమిషనర్ అనుపమ తెలిపారు. ఆలస్యం అయ్యేకొద్దీ క్రీడాకారులకు నిరుత్సాహం మిగులుతుందని, త్వరితగతిన పూర్తి చేసి స్టేడియంను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సకాలంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ భాలాజీ పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మార్చి నెలాఖరుకల్లా మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు, సెబ్ అధికారులు సమిష్టి కృషితో పనిచేస్తున్నారని ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి చెప్పారు. నెలవారీ నేర సమీక్షను ఎస్‌పి శనివారం నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలపై నేర నివారణ బృందాలను ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని, జిల్లావ్యాప్తంగా 140 పోలింగ్ కేంద్రాలు, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని పోలీసు శాఖకు దిశానిర్దశం చేశారు. వారానికి ఒకరోజు నో యాక్సిడెంట్ డేగా పరిగణించి పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్క రోడ్డు ప్రమాదం జరగకుండా నివారించాలన్నారు. సమీప భవిష్యత్‌లో నో యాక్సిడెంట్ వీక్‌ను జరుపుకునేలా ప్రణాళికలు రచించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న మిస్సింగ్ కేసుల విషయంలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేడీలు, బ్యాడ్ క్యారెక్టర్లు, రౌడీషీటర్లు సస్పెక్ట్ ల కదలికలపై నిరంతర నిఘా ఉంచి ఇతర నేరాలకు పాల్పడకుండా నిరోధించాలన్నారు. గత నెలలో కేసుల దర్యాప్తు చేధనలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహక ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వెంకటరావు అడ్మిన్ , కులశేఖర్ శాంతి భద్రత, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, విమల కుమారి నేర విభాగం, మునిరామయ్య తిరుమల పాల్గొన్నారు.

'శ్రీనివాస సేతు' త్వరితగతిన పూర్తి చేయాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీనివాస సేతు మూడో దశలో నిర్మాణంలో ఉన్న దాదాపు ఆరు స్టీల్‌గర్డర్‌లను రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి ఆదేశించారు. ఏప్రిల్ 15లోపు అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడి పరిపాలనా భవనంలో శనివారం తిరుపతి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలితో కలిసి ఈవో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ రామానుజ సర్కిల్ నుంచి రేణిగుంట వైపు, తిరుచానూరు మార్కెటింగ్ యార్డు వరకు ఉన్న శ్రీనివాస సేతు పనులను మార్చి 15లోపు పూర్తి చేయాలన్నారు. శ్రీనివాస సేతు పనులు ఇప్పటికే 89శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు మే 15కల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పాదచారులు నడిచేందుకు అనువుగా పేవ్‌మెంట్, కాల్వలను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. సుబ్బలక్ష్మి సర్కిల్ వద్ద పచ్చదనం పెంపొందించాలని, అవసరమైన చోట్ల పెయింటింగ్ తదితర పనులపై ఈవో సమీక్షించారు. ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్‌ఎఅండ్ సిఎఒ బాలాజీ, సిఇ నాగేశ్వరరావు, మున్సిపల్ ఎస్‌ఇ మోహన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వీర్యం : నారా లోకేష్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

టిడిపి అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. ఐదు లక్షల బీమా పథకం కొనసాగిస్తామన్నారు. ప్రసవించిన కార్మికుని భార్య లేక కూతుళ్లకు ఒక్కొక్కరికి రెండు కాన్పులకు కాన్పుకు 20వేల చొప్పున సాయం చేస్తామని చెప్పారు. వైసిపి హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వీర్యం అయ్యిందని, నిధులు పక్కదారి పట్టాయని విమర్శించారు. యువగళం పాదయాత్ర 27వ రోజు శనివారం తిరుపతి అంకుర ఆస్పత్రి వద్ద విడిది కేంద్రం వద్ద భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. జగన్ పాలనలో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని, ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఇసుక అక్రమ రవాణా ద్వారా రోజుకు మూడు కోట్లు సంపాదిస్తున్నారన్నారు. మన రాష్ట్రం ఇసుక ఇతర రాష్ట్రాల్లో దొరుకుతుందన్నారు. ఇసుక ద్వారా జగన్ ఐదేళ్లలో ఐదువేల కోట్లు సంపాదిస్తున్నారని విమర్శించారు. టిడిపి హయాంలో వెయ్యి రూపాయలు ఉన్న ట్రాక్టర్ ఇసుక, జగన్ హయాంలో ఐదువేలకు చేరిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక చాలా మంది ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బోర్డు నుంచి ఎటువంటి క్లైమ్ రావడం లేదన్నారు. అసలు అప్లికేషన్లు తీసుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు.

తిరుపతికి ఇద్దరు ఎమ్మెల్యేలు

తిరుపతి నగరానికి ఇద్దరు ఎంఎల్‌ఎలు ఉన్నారని, ఒకరు కరుణాకర్‌రెడ్డి, రెండో ఎంఎల్‌ఎ భూమన అభినయ్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఇళ్ల నిర్మాణాలకు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతులు ఇవ్వాలంటే లక్ష -5 లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. ఈ డబ్బంతా సాయంత్రానికి అభినయ్‌రెడ్డికి చేరుతుందన్నారు. ఇళ్లలో బోరు వేయాలన్నా లక్ష పైనే ముట్టజెప్పాల్సిందేనన్నారు. అనుమతుల పేరిటే అభినయ్‌రెడ్డి రూ.500 కోట్లు దోచుకున్నారన్నారు. ఎంఎల్‌ఎ కరుణాకర్‌రెడ్డి డ్రగ్స్, గంజాయిపై పోరాడుతున్నారని పైకి బిల్డప్ ఇస్తున్నారని, ఆకస్మిక తనిఖీలంటూ రోడ్డుపైకి వచ్చి హడావిడి చేస్తున్నారని, అయితే నగరంలో డ్రగ్స్, గంజాయి ఇంతగా పెరిగి యువత పెడదోవ పట్టడానికి ఎంఎల్‌ఎ కుమారుడే అసలు దోషన్న విషయం విచారిస్తే తేలుతుందన్నారు. ఇటీవల నిర్వహించిన బార్ టెండర్లలో దరఖాస్తు చేసిన వ్యక్తులను సిండికేట్ చేసి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేయడంతో పాటు వారి నుంచి పది కోట్లు వసూలు చేశారని విమర్శించారు. ఇటువంటి ఎంఎల్‌ఎ తిరుపతిలో మద్యనిషేధంపై పోరాడుతున్నారని చెబితే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వస్తే వీటన్నింటిపై విచారణ జరుపుతామని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

ఆంక్షల మధ్యే నారా లోకేష్ యాత్ర

నారా లోకేష్ పాదయాత్ర తిరుపతి నగరంలో ఆంక్షల మధ్యే సాగింది. కేవలం పలకరింపులు, సెల్ఫీలు, ఫొటోలకే పరిమితమయ్యింది. సాయంత్రం నాలుగు గంటలకు విడిది కేంద్రం నుంచి యాత్ర చేపట్టారు. యాత్రలో తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, బిఎల్ సంజయ్, ఊకా విజయ్‌కుమార్, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ నారా లోకేష్‌తో కలిసి యాత్రలో పాల్గొన్నారు. తిరుపతి మార్గంలోని బ్లిస్ హోటల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం, గాంధీ విగ్రహం, రైల్వేస్టేషన్, కర్నాలవీధి, బేరివీధి మీదుగా ప్రకాశం రోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకూ యాత్ర సాగింది. అక్కడనుంచి తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం మీదుగా చంద్రగిరి నియోజకవర్గంలో చేరుకుంది. లోకేష్‌యాత్రలో ఎక్కడా మైకు తీసుకుని మాట్లాడే అవకాశాన్ని పోలీసులు ఇవ్వలేదు. అడుగడుగునా పోలీసు భద్రత మధ్యనే యాత్ర సాగింది. టిడిపి నగర అధ్యక్ష కార్యదర్శులు చిన్నబాబు, మహేష్‌యాదవ్, టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, సురా సుధాకర్‌రెడ్డి, పుష్పావతి, బుల్లెట్ రమణ, మునిశేఖర్, ఆముదాల తులసీరామ్ ఉన్నారు. రాత్రి తిరుచానూరు సర్కిల్ విడిది కేంద్రంలో బస చేయనున్నారు.

తిరుపతి 'తిరు'నాళ్లు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఇదేంటి ఇది సెప్టెంబరు-అక్టోబరు నెలలు కాదే తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు (తిరునాళ్ల)ను జరిపేందుకు. అలాగని సూర్యప్రతాపం భరించలేని మే నెల కాదే తిరుపతి గ్రామదేవతగా ఉన్న గంగమ్మతల్లి జాతర (తిరునాళ్ల)ను జరిపేందుకు. తెలుగు సంవత్సరాది ఉగాది కూడా రాక ముందే ఈ తిరునాళ్లు ఏంటని ఆశ్చర్యపోతున్న పాఠకులకు తిరుపతిలో మరో తిరునాళ్లను పరిచయం చేద్దాం. దక్షిణాది రాష్ట్రాలు గొప్పగా జరుపుకునే సంక్రాంతి పండుగుల తర్వాత, దక్షిణ కైలాసంగా వెలుగొందుతున్న శ్రీకాళహస్తి వాయులింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసి ముగియగానే జిల్లాలో మరో తిరునాళ్లను తిరుపతి వాసులకు ఫిబ్రవరి నెలలోనే పరిచయం చేశారు స్థానిక ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి. తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని గుర్తు చేసి, వేడుకలు జరుపుకునేందుకు చర్యలు తీసుకున్నారు. తాను రెండోసారి ఎంఎల్‌ఏగా గెలిచిన ఏడాదిలో తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. రెండు సంవత్సరాల క్రితం కొత్తగా ఏర్పడిన తిరుపతి కార్పొరేషన్ పాలకమండలిలో ఈ విషయమై చర్చించి, ప్రతి ఏడాది వేడుకగా జరపాలని నిర్ణయించి కొనసాగిస్తున్నారు.

తిరుపతి చరిత్ర...

శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన ఆధ్యాత్మిక నగరం తిరుమల. శ్రీవారి పాదాల చెంత వెలసిన నగరం తిరుపతి. తిరుపతి, తిరుమల రెండు ఒకే గొడుగు కిందకు వస్తాయి. అందుకు ఈ రెండు నగరాలను కలుపుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఏర్పడింది. తిరుపతి ఒకప్పుడు చిన్న కుగ్రామం. వివిధ పేర్లతో పిలవబడిన ఆ గ్రామమే కాలక్రమేణా తిరుపతిగా స్థిరపడింది. ఎన్నో ఏళ్ల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు. ఇప్పటికి శిలాశాసనాలు ద్వారా తిరుపతి ఘన చరిత్రను మనకు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. తిరుపతి నగరంగా ఆవిర్భావం కాక ముందు క్రీ.శ 1130 ఫిబ్రవరి 24న, సౌమ్యనామ సంవత్సరం పాల్గొణ పౌర్ణమినాడు సోమవారం రామానుజులు గోవిందరాజుల పీఠాధిపతిని ప్రతిష్టించి, నిత్యకైంకర్యాలు చేసి, నాలుగు మాఢవీధులను అగ్రహారాలతో తిరుపతిని నిర్మించడం మొదలు పెట్టారు. ఆ తర్వాత దేవాలయానికి చుట్టూ ఉన్న ఇతర సంఘాలు తిరుపతిగా మారాయి. తిరుపతి నగర మూలకర్తగా పిలవబడే రామానుజాచార్యులు తన గురువు పేరుతో మొదట తిరుపతికి రామానుజపురం అని నామకరణం చేశారు. ఇది చాలా కాలం ఇలానే పిలవబడేది. మొదట దీన్ని గోవిందరాజుపట్టణం అనేవారు. అనంతరం రామానుజపురం పేరుతో చాలాకాలం పిలిచారు. 13వ శతాబ్ధం ప్రారంభం నుంచి తిరుపతి అని పిలిచేవారు. ఈ విషయాన్ని గత ఏడాది ఆధారాలతో నిరూపించారు తిరుపతి శాసనసభ్యులు. దీంతో చారిత్రక ఆధారాలతో ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకుంటున్న మొట్టమొదటి నగరం బహుశా దేశంలో ఇదే మొదటిది.

తిరుపతి 893వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారం ముందు నుంచే ఎంఎల్‌ఏ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలకు అన్ని సిద్ధం చేశారు. నగరంలోని 50 వార్డుల కార్పొరేటర్లు ఇందులో పాల్గొనేలా చేశారు. నగరమంత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గోవిందరాజుస్వామి ఆలయ నాలుగు మాఢవీధులైన రైల్వేస్టేషన్ జంక్షన్, కర్నాలువీధి, నేతాజీరోడ్డు, భేరివీధి, కృష్ణాపురం ఠాణా, గాంధీరోడ్డు, జి.కార్‌స్ట్రీట్, తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు సర్కిల్ తదితర వీధులన్ని సుందరంగా ముస్తాబు చేశారు. పండిర భజన, చెక్కభజన, కులకుభజనలు, కోలాటాలు, పిలంగ్రోవులు, తప్పెడగుండ్లు, మంగళవాయిద్యాలు, పురాణాపురుషులు, దేవాతామూర్తులు వంటి వివిద రకాల వేషధారణలు, ఆశ్వదళాలు, గజరాజులు ప్రహరీతో తిరుపతి ఆవిర్భావ ఉత్సవాలను ఔరా అనిపించేలా నిర్వహించారు. ఈ వేడుకలకు సుమారు కోటిరూపాయలకు పైగానే వ్యయం చేసినట్లు అంచనా.

నేదురుమల్లితో ఐఐహెచ్‌కి పూర్వవైభవం

ప్రజాశక్తి-బాలాయపల్లి: నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని ఇండియన్ హ్యాండ్ ల్యూమ్ టెక్నాలజీ కళాశాలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి తెలిపారు. శనివారం నేదురుమల్లి ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక ఐఐహెచ్‌టీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.ఐ.హెచ్ టి కళాశాల విద్యార్థులకు ఉపయు క్తంగా ఉండేలా వర్క్ షెడ్ మరమ్మతులను నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేదురుమల్లి రామకుమార్ రెడ్డి సొంత నిధులతో చేపట్టనున్నారని తెలిపారు. ఆ కళాశాలను మరింత అభివద్ధి చేసేలా నేదురుమల్లి ఆధ్వర్యంలో ప్రణాళికలను తయారు చేసి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. చేనేతలు ఎక్కువగా ఉండే వెంకటగిరి ప్రాంతంలో ఆ వర్గా లకు ఉపయోగకరంగా ఉండాలన్న ఆశయంతో దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఐఐహెచ్‌టి ఏర్పాటు చేయించారన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ కన్వీనర్ ఢిల్లీబాబు, జిల్లా వైసీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్, ఐఐహెచ్‌టి సిబ్బంది, నేదురుమల్లి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వ సూరజ్ కుండ్ మేళా అథారిటీ ఆధ్వర్యంలో పంజాబ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా చేనేత కార్మికుడు పుత్తూరు పట్టణానికి చెందిన పుట్టరాజా రెండు రోజుల క్రితం పరంపర ఘట్ అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పరంపర ఘట్ అవార్డు ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని పుట్ట రాజా తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి -కోట : రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ ఉమ తెలిపారు. శనివారం కోట వ్యవసాయం కార్యాలయంలో ఏవో నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో వీఏవోలతో సమీక్షించారు. గ్రామాల్లో రైతులకు రాయితీతో వచ్చే పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. వ్యవసాయ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేయాలని తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని అలిమిలి గ్రామ సమీపంలో కనుమురాయుడు కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి వైసీపీ తిరుపతి జిల్లా ప్రచారవిభాగ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటగిరి తోట గణేష్, నాగరాజు, పెచ్చి, మన్నూరు రామతులసి, అలిమిలి బాబు రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-బాలాయపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో స్వరూప రాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కడైనా ప్రచారాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మండల శాఖ అధికారులు ఆర్ఐ పూర్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లి ఆలయంలో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-నాగలాపురం: సురుటుపల్లిలోని శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు శనివారం ఉదయం నుంచి చేపట్టారు. సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ సయన, ఆలయ కార్యనిర్వాణాధికారి కోటి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది హుండీ కానుకల సొమ్మును లెక్కించారు. ఈ సందర్భంగా రూ.35.71 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మునివేలు, ఆనంద్, మంజుల ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి సేవలో అమర్‌నాథ్‌రెడ్డి



ప్రజాశక్తి-పిచ్చాటూరు: నారాయణవనం మండలం సింగిరికోనలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని టీడీపీ తిరుపతి, చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ బీదా రవిచంద్ర, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయం ఉండటం భక్తులకు సౌకర్యవంతమన్నారు. కార్యక్రమంలో దేవాలయం ట్రస్టు అధ్యక్షులు గుణవంత రావు, టీడీపీ మండల ఇన్‌ఛార్జి గిరిబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు సద్వినియోగం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు సచివాలయంలో శనివారం ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించి పలు సూచనలు చేశారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, ఫింగర్ ప్రింట్స్ మొదలైన ఆధార్ కార్డుకు సంబంధించిన నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నారా లోకేష్‌కు వడమాలపేట నాయకుల సన్మానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భానుప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో ఘనంగా సన్మానించారు. చినబాబు, నాయకులు జానా, వెంకటయ్య, హేమావతి, లక్ష్మీప్రసన్న, మణిరాజు, జీవరత్నం నాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలిళ్లకు గ్రహణం..!

- మంజూరు సరే.. నిర్మాణాల్లో ఆలస్యం
- పేదల సొంతింటి కల నెరవేరేనా..!
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-ఓజిలి: అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కాగృహాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పండుగ వాతావరణంలో జగనన్న శాశ్వత గహ భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. పేదవారికి సొంత ఇంటి కల నెరవేరుతుందని పేదలు ఎంతగానో ఆశించారు. జగనన్న లేఅవుట్‌లో గహాలు మంజూరు చేయకపోవడంతో ఉండటానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయలు అద్దె చెల్లించి నివాసం ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సొంతింటి కల అనుగ్రహం ఎప్పుడు తమ దరి చేరుతుందోనని పేదలు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏ పార్టీ అయినా పేదల సొంతింటి కలను నెరవేరుస్తామంటూ హామీలు ఇస్తున్నారు.. ఎన్నికలు ముగిశాక సొంతింటి పేదల కల నెరవేరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా పేదవారి పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదు. గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో పేరుతో ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నెరవేరుస్తామని ఐదు సంవత్సరాల పాటు చెప్పుకుంటూ వచ్చారు. నిర్మాణాలు చేపట్టి అందరికీ ఇళ్లు చూపుతామని పనులను ప్రారంభించారు. పనులు జరుగుతుండగానే టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో వాటికి గ్రహణం పట్టుకుంది. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సచివాలయాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ప్రభుత్వం గృహాలను మంజూరు చేయకపోవడంతో మంజూరైన ఇంటి స్థలాల్లో పూర్తిస్థాయిలో గృహనిర్మాణం పనులు చేపట్టలేదు.

గృహ నిర్మాణాలు చేయకపోవడంతో దర్శనమిస్తున్న కంపచెట్లు

ఆసక్తి చూపని లబ్ధిదారులు

ఓజిలి మండల వ్యాప్తంగా పది సచివాలయ పరిధిలో సుమారుగా 464 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. గతంలో నూడా పరిధిలో మొత్తం 483 గృహాలు మంజూరు కాగా గహాల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో 212 గృహాలు మాత్రమే మంజూరయ్యాయి. ఇందులో నూడా పరిధిలో ఉన్న గ్రామాలలోని జగనన్న ఇంటి స్థలాల్లో రాజుపాలెం గ్రామంలో 12 , రాచపాలెం గ్రామంలో 11 గృహాలకు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

అరకొర నిధులతో ఇంటి నిర్మాణం

ప్రస్తుతం గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో గతంలో స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి రూ.15 వేలు తొలగించి రూ.1.65 లక్షలు మాత్రమే మంజూరు చేస్తున్నారు. తాజా ధరలు చూస్తే ఆ సొమ్ము పూర్తిస్థాయి నిర్మాణానికి సైతం సరిపోదని లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో మేస్త్రీ , కూలీలకు కలిపి సుమారుగా రూ.40 వేలు అయ్యేది. ప్రస్తుతం కూలి రేట్లు పెరగడంతో ఇది రెట్టింపు అవుతూ నిర్మాణదారులపై ఆర్థిక భారం పడుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర ధరలతో బతకడమే కష్టంగా ఉంటుందని, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగితే తాము ఎలా బతకాలని.. ఎలా ఇళ్లు నిర్మించుకోవాలని పేదలు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇటు ప్రభుత్వం అటు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో జగనన్న ఇంటి స్థలాలలో గృహాల బదులు పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఇచ్చే నిధులను పెంచి వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తే నిర్మాణాల పనులు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

లబ్ధిదారులందరికీ గృహనిర్మాణాలు

జగనన్న లేఅవుట్‌లోని లబ్ధిదారులు గృహనిర్మాణం కోసం ముందుకొస్తే తుడా పరిధి కింద గృహ నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేసి ప్రతి ఒక్కరికీ గృహాలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే తుడా పరిధిలో 102 గహాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

- రజనీకాంత్, ఎంపీడీవో, ఓజిలి

గ్రామాల్లో జోరుగా ప్రచారం

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగారావుపేట, జి.ఎస్.రాయల్ సెంటర్, కోర్టు సెంటర్, మాళవ్యానగర్, జానకిరాంపేట తదితర ఏరియాల్లో ఓటర్లను కలిసి పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా ప్రచారం చేశారు. రెండో పట్టణ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి సిబ్బందిని కలిసి కరపత్రాలను అందించారు. 'కోర్టు సెంటర్లో' సుమారు 40 మంది ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో గూడూరు సెంటర్‌శాఖ కార్యదర్శి జోగిశివకుమార్, జిల్లా సి.ఐ.టి.యు ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి.రమణయ్య, కె.వి.పి.ఎస్. నాయకులు అడపాల ప్రసాద్, యస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర్లురెడ్డిని గెలిపించాలని కోట మండల సీఐటీయూ మండల కార్యదర్శి ఎమ్.హరినాథ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండల పరిధిలో ఉండే జరుగుమల్లి, కొత్తపాలెం, వంజివాక, విద్యానగర్ గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలసి విలువలు కలిగిన ప్రజా సమస్యలపై ప్రశ్నించగలిగిన పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ మండల కార్యదర్శి హరినాథ్, మండల అధ్యక్షులు రమణయ్య పాల్గొన్నారు.

సమన్వయంతోనే బాలాయపల్లి అభివృద్ధి

బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-బాలాయపల్లి: అందరి సమన్వయంతోనే బాలాయపల్లి అభివృద్ధి సాధ్యమవుతుందని.. సర్పంచులు, ఎంపీటీసీలతోపాటు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు నిర్మాణాల కోసం పంపిణీ చేసిన సిమెంటు బస్తాలు ఎక్కడ ఉన్నాయని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని అలిమిల్లి గ్రామంలో ఇంతవరకు గ్రామ సచివాలయాలు ప్రారంభించకుండానే 150 సిమెంట్ బస్తాలు మాయమైపోయాయని మండిపడ్డారు. సిమెంట్ బస్తాల అక్రమంపై వెంటనే నివేదికలతో పాటు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. జయంపు గ్రామంలోని పశువైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో అనేక పశువులకు వ్యాధులు వచ్చి మరణిస్తున్నాయని జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. ఇక జయంపు గ్రామానికి వీఆర్వో లేకపోవడం దారుణమని చెప్పారు. వెంగమాంబపురం గ్రామంలో వెంకటగిరి-గూడూరు రోడ్డు

మార్గంలో సీసీ రోడ్డు నాసిరకంగా చేస్తున్నారని సర్పంచ్ బాపనపల్లి వెంకటసుబ్బయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు లైను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పాకపొడి గ్రామ సర్పంచ్ గోపికష్ణారెడ్డి మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీ కేవలం మండలంలో మూడు గ్రామాలకే వర్తిస్తుందా అని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రానున్నది ఎండాకాలం కావడంతో మండలంలోని 24 పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో స్వరూప రాణి, వైస్ ఎంపీపీ పార్వతి, మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అందరి సహకారంతో జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక సన్నిధి ధూర్జటి కళా ప్రాంగణంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల విజయవంతపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల విజయవంతానికి కషి చేసిన అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శివయ్య ఆశీస్సులు, అందరి కషి మూలంగా మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విజయవంతం అయ్యాయని కొనియాడారు. ఉత్సవాల

విజయవంతంలో పాలుపంచుకున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పలు శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల భూముల రీసర్వే చేయాలి

పజాశక్తి -గూడూరు : తిమ్మనగారిపాలెం దళితులను మోసం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కేఆర్ దాసరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తిమ్మనగారిపాలెం దళితులు డిమాండు చేశారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట కేఆర్ దాసరి చర్యలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. చిల్లకూరు మండలం తిమ్మనగారిపాలెం అంబేద్కర్ గ్రామ కమిటీ కన్వీనర్ జోగి వెంకటరమణయ్య అలియాస్ శివ మాట్లాడుతూ తిమ్మనగారి పాలెం లో దాదాపు 100 కుటుంబాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నారని.. ప్రభుత్వ భూములను గత 20 సంవత్సరాల నుంచి -మాయిల్, నిమ్మ మెట్ట పైర్లు పండించుకుంటూ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. 2018 లో సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీ భూములుగా మార్పు చేసినప్పుడు, తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరామన్నారు. 2018లో దాదాపు 30 కుటుంబాల వారికి పట్టాలు ఇవ్వన్వికుండా.. భూ పంపిణీ చేయకుండా దాసరి

కాంతారావు అలియాస్ కేఆర్ దాసరి అనే వ్యక్తి ప్రభుత్వ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసి భూపంపిణీ కి అడ్డుకున్నారని ఆరోపించారు. దాసరి కాంతారావు అలియాస్ కేఆర్ దాసరి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు భూ పంపిణీ చేయకుండా అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నాడని, అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో కష్ణయ్య, పురుషోత్తం, పరశురామయ్య, రాధమ్మ, రాజేశ్వరమ్మ, సుజాతమ్మ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చదువుతోనే సమాజంలో గుర్తింపు.. గౌరవం ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని నగరి ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. శనివారం నగరి మండలంలోని నంబాంకం పంచాయతీలో పర్యటించి బడిబయట పిల్లలను గుర్తించారు. ముగ్గురు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. చదువుకునే వయస్సులో పిల్లలను ఇతర పనులకు పంపి వారి జీవితాలను నాశనం చేయకండని.. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో మెరుగైన విద్యను అందిస్తోందని.. పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని సూచించారు. అనంతరం ముగ్గురు పిల్లలను ఎం.కొత్తూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బేబీరాణి, మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన దాచేపల్లి హరిప్రసాద్(46) కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి తిరుమల వెళ్తూ తీవ్రంగా గాయపడ్డాడు. కానిస్టేబుల్ శ్రీనివాసులు ఆయన్ను బయటకు తీశారు. ఎస్సై కష్ణారెడ్డిరెడ్డి సహకారంతో ప్రైవేటు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. నెల్లూరు అపోలాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా పనిచేస్తా..!

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న తనకు అప్పగించిన గురుతర బాధ్యతను నమ్మకంతో నెరవేర్చుతానని, తనకు పార్టీలో గుర్తింపు వచ్చేలా చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి విధేయుడిగా పనిచేస్తానని వైసీపీ ట్రేడ్ యూనియన్ కమిటీ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఉపేంద్రారెడ్డి స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు వైసీపీ ట్రేడ్ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన ఉపేంద్రారెడ్డి శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలసి కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలసిన వారిలో తిరుపతి రూరల్ మండలం వైస్ ఎంపీపీ మాదవరెడ్డి, పేరూరు ఎంపీటీసీ మూలం చంద్రమోహన్ రెడ్డి, అజయ్ కుమార్, స్థానిక నేతలు ఉన్నారు.

పెళ్లూరు సుమన్ ప్రజాపతికి గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-కోట: మండలంలోని కొక్కుపాడు గ్రామానికి చెందిన పెళ్లూరు సుమన్ ప్రజాపతిని గౌరవ డాక్టరేట్ వరించింది. ప్రముఖ విశ్వవిద్యాలయమైన ఆసియా వేదిక్ కల్చరర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం, హెరీసూరు లోని క్లిరిష్టా నాలుగు నక్షత్రాల హోటల్‌లో ఆయన ప్రముఖులచే గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సుమన్ ప్రజాపతి హిందూ సేవాదళ్ ను, స్వచ్ఛంద సేవాదళ్ లను స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వందలాది నిరాశ్రయులను, అభాగ్యులను ఆదుకున్నారు. సామాజిక కార్యక్రమాలను గుర్తించిన ఆసియా వేదిక్ కల్చరర్ ఫౌండేషన్ సుమన్ ప్రజాపతికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

నగరిలో భానుప్రకాష్‌ను గెలిపించుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అధ్యక్షతన తిరుపతిలో జరిగిన నగరి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు నగరిలో యువగళం పాదయాత్రను విజయవంతం చేశారని అభినందించారు. ఇదే ఉత్సాహంతో అందరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని సూచించారు. అందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చిన్నబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి డీఎస్ గణేష్, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, టీఎన్‌టీసీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు మాధవ నాయుడు, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రూరల్ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, చిత్తూరు పార్లమెంటరీ మహిళా నాయకురాలు లక్ష్మీప్రసన్న, వడమాలపేట ధనుంజయనాయుడు, నింద్ర వాసు, హేమావతి, నగరి మహిళా నాయకురాలు మాజీ ఎంపీపీ మీరా, పుత్తూరు మహిళా నాయకురాలు నాగరత్నం, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రేణిగుంట, గాజులమణ్యం, పిల్లపాలెం తదితర గ్రామాలలో విస్తత దాడులు నిర్వహించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.

ఏకొల్లు పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- దొరవారిసత్రం: ఏకొల్లులోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: తిరుపతి 'రాస్' కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అధికారులు ఉద్యాన పంటల రైతులకు అవగాహన కల్పించారు. శనివారం చిట్టేచెర్ల, దేవరకొండ, దీందార్లపల్లి, చెరువుముందరపల్లి గ్రామాల్లో వారు పర్యటించి సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలు, కోత పరికరాలు, పనిముట్లు, పండ్లను మగ్గించడం, గ్రేడింగ్, నిల్వ విధానాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాస్ శాస్త్రవేత్త సుధాకర్, మండల ఉద్యానశాఖాధికారి శివకుమారి, వ్యవసాయాధికారి ధనలక్ష్మి, వీహెచ్‌ఏ కిషోర్, పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

పోలీసులకు జిల్లా ఎస్పీ ప్రశంసలు

ప్రజాశక్తి- పిచ్చాటూరు: పులికుండ్రంలోని తంగరాజ్‌పై జరిగిన హత్య కేసులో కన్న కొడుకు, కోడలు కలిసి చేసిన హత్య చేయడాన్ని ఛేదించి ఆధారాలతో నిరూపించి కోర్టులో ముద్దాయిలకు శిక్ష పడినట్లు చేసిన పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌ను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. అలాగే సీఐతోపాటు పిచ్చాటూరు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐ డీబీ రాజు, కానిస్టేబుల్ మోహన్, నరేష్, దాములకు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి శనివారం ప్రశంశాపత్రాలు అందించారు.

షిఫ్ట్ ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ షిఫ్ట్ ఆపరేటర్ నిండు ప్రాణాల్ని బలిగొంది. బోనుపల్లి సబ్ స్టేషన్‌లో తనదికాని మరమ్మతు పనులు చేస్తూ గిరీష్ అనే ఒప్పంద షిఫ్ట్ ఆపరేటర్ శనివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లికి చెందిన గిరీష్(29) మండలంలోని 33 కేవీ బోనుపల్లి సబ్ స్టేషన్ లో ఒప్పంద షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సబ్ స్టేషన్ లో మెయింటినెన్స్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఆ సమయంలో మరో ఒప్పంద షిఫ్ట్ ఆపరేటర్ రమేష్ అదృష్టవశాత్తు ప్రాణాలు దక్కించుకున్నాడు. అయితే గిరీష్ మృతి వెనుక విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. మృతుడు గిరీష్‌కు భార్య, మూడేళ్లు నిండని పాప, బాబు ఉన్నారు. గిరీష్ మృతితో వీఎంపల్లిలో విషాదం అలుముకుంది.